

# సాయి లీలలు

శ్రీ షిర్డీసాయిని సేవించే భక్తులలో పిళ్ళే అను భక్తుడు కూడా ఉన్నాడు. తరచు వచ్చి బాబాని చూసి తరించి, సేవించి వెళ్ళేవాడు.

అలాంటిది - అతనికి గినియా అనే పురుగు వలన కురుపు వచ్చి, బాగా సలపరము, నెప్పి, విపరీతమైన బాధ కలిగిస్తూ దుఃఖితుడిని చేసింది. పాపం చాలా బాధపడసాగాడు.

అప్పుడు అతని దగ్గరకు అతని స్నేహితుడు కాకాసాహెబు అనునతడు వచ్చి, ''రారా పిళ్ళే... షిర్డీకి పోయి సాయినాధుని సేవించుకు వద్దాం'' అన్నాడు.

అప్పుడు పిళ్ళే ''ఎలా రాగలను. ఈ కురుపు నన్ను బాగా సతాయిస్తోంది. నడవలేకున్నాను. గతజన్మ ఖర్మంతా ఈ జన్మలోనే అనుభవించాలంటే నా వల్లకాదురా. ఈ ఖర్మని బాబా దయతో పది జన్మలకు సరిపడునట్లుగా పంచితే బావుండును. లేదా చచ్చిపోవాలని ఉంది ఈ బాధని ఓర్చుకోలేక'' అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుని తన గోడంతా చెప్పుకున్నాడు. ''సరేలే, నే వెళ్తాను బాబా దగ్గరకు. చూడాలని ఉంది. నేనొక్క క్షణం ఇంక ఇక్కడ ఆగలేను'' అంటూ బయలుదేరి వెళ్ళాడు.

అక్కడ షిర్డీలో శ్రీ సాయిబాబా భక్తులందరినీ సమావేశపరుచుకొని ఏవో నీతిబోధలు చెప్తున్నారు. అంతట కాకాసాహెబు వెళ్ళి, శ్రీసాయి పాదాలపై పడి నమస్కరించి ఆనందభాష్పాలతో, ''సాయినాథా! నిన్ను విడిచి ఉండలేకున్నాను. వారం ఆగాలంటే ఓ యుగంలా ఉంటోంది'' అన్నాడు. అప్పుడు సాయిబాబా, ''అలాగంటే ఎలా కాకా... ఎవరి ధర్మం వారు నెరవేర్చాలిగా'' అని సముదాయించి ఓ క్షణం ఆగి, ''మన పిళ్ళే ఏమంటున్నాడు?'' అని అడిగాడు నవ్వుతూ.

అంతా వివరించి చెప్పాడు కాకాసాహెబ్. దయార్ద్రహృదయుడు, కరుణామయుడు అయిన సాయిబాబా, ''జన్మలు ఎత్తాలని, కావా

జి. రామలక్ష్మి, హైద్రాబాదు

అని కోరుకోకూడదు. ఎత్తిన జన్మకే మోక్షం లభించాలని ఆశించాలి. గతజన్మ ఫలమే ఈ జన్మలో అనుభవించేది చాలక మళ్ళీ మళ్ళీ జన్మలు కావాలని కోరుకోవటం మనిషియొక్క అవివేకం. త్వరగా వెళ్ళి పిళ్ళేని తీసుకురా. పది జన్మలలో ఎందుకు, పది రోజులలో తగ్గించేస్తాను అతని గత జన్మ ఖర్మసారాన్ని'' అన్నారు. కాకా వెంటనే వెళ్ళి పిళ్ళేని తీసుకొచ్చాడు.

బాబా పిళ్ళేని ఓదార్చి, ''నీకు నేనుండగా భయమేల? నీ భారములు నాపైవేయుము. నేను మోసెదను'' అంటూ అంతకుముందు అతను కట్టుకున్న కట్టును విప్పి, ''ఇది అలాగే ఉంచు. కట్టు కట్టకూడదు. దీనిని ఒక కాకి వచ్చి పొడిచి నయంచేస్తుంది. అందాకా ఆ మూల పడుకో'' అని చెప్పారు.

అప్పటికి బాగా చీకటి పడింది. దీపాలు ముట్టించాలని అబ్దుల్ అనే అతను తడుముకుంటూ వచ్చి పొరపాటున చూసుకోకుండా ఆ మూల పడుకున్న పిళ్ళేని చీకట్లో ఆ కురుపుమీద తొక్కేసాడు. పిళ్ళే కెవ్వుమని అరిచాడు. మరుక్షణం దీపాలు వెలిగాయి బాబా మహిమ వలన. అంతేకాదు, గినియా పురుగులన్నీ కురుపు చితకటం వలన బిలబిలా బయటకు వచ్చేసాయి. సలపరం తగ్గింది. బాబా అతనికి సేవలనందించి ఊదా కలిపిన నీళ్ళు త్రాగించి, ఊదానే మందుగా కురుపుపై రాసి పడుకోబెట్టారు. అలా పదిరోజుల్లో అది నయం అయి పిళ్ళే లేచి ఆనందంగా తిరగ్గలిగాడు. కరుణామయుడు సాయి అతనిని ఆశీర్వదించి మరీ పంపారు అతని ఊరికి. అయితే వెళ్ళేటప్పుడు పిళ్ళేని దగ్గరకు పిలిచి, ''నీ మనసులో ఒక ఆలోచన వుంది. అది అడగడానికి సందేహిస్తున్నావు నేను ఏమనుకుంటానోనని. కాకి వచ్చి తగ్గిస్తుందని చెప్పారు బాబా, కానీ కాకి రాలేదేం? అని నీ సందేహం. కాకంటే ఎవరో కాదు అబ్దుల్లాయే! అతనిని నేను ముద్దుగా కాకి అని పిలుస్తూంటాను అతని చేష్టలకి'' అంటూ నవ్వారు బాబా. అప్పుడప్పుడు అలా చతురోక్తులు విసురుతూ భక్తులను ఆనందపరచటం ఆ కరుణామయుడి లీలలలో ఒక భాగం సుమా!

